క్లుప్తంగా

నేడు కోదండ రాముడి తీర్థం



మధురవాడలోని కోదండ రాముడి గుడి

మధురవాడ: బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ గణపతి సాయినాథ సమేత కోదండ రామాలయం వద్ద మంగళవారం కోదండ రాముడి తీర్థం జరగనుంది. ఈ స్వామిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తారు. ఇక్కడ తీర్థం, పూజల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ అర్చకులు సీతారామాచార్యులు చెప్పారు.

మంజునాథ, సుబ్రహ్మణ్యస్వామి సేవల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి



కుక్కి సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి దంపతులు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం సతీసమేతంగా కర్ణాటకలో ప్రసిద్ధి గాంచిన మంజునాథస్వామి, కుక్కి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను దర్శించుకుని స్వామి దర్శనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.

సెల్‌ఫోన్ చోరీ

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయితీకి చెందిన బోని సన్యాసినాయుడుకు చెందిన సెల్‌ఫోన్ సోమవారం సాయంత్రం రాస పోలమాంబ ఆలయం వద్ద చోరీకి గురయింది. ఆలయ కూడలి వద్దకు పనిమీద వచ్చిన బాధితుని నుంచి రూ.18 వేల విలువైన ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీనిపై బాధితుడు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

పీఎం పాలెం: నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పీఎం పాలెం పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. నగరంపాలెం రోడ్డులోని బాంబేకాలనీ కూడలి వద్ద అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. స్థానిక ఎస్ఐ వెంకటరావు తన సిబ్బందితో దాడి చేసి అవినాష్, కె. పూరిబాబు, రవి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని సోదా చేయగా 4.8 కేజీల గంజాయి దొరగ్గా.. దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

తీరంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీస్ డాగ్

బీచ్ రోడ్డు: తీరంలో నిఘా పెంచే కార్యక్రమంలో భాగంగా పోలీసులు డాగ్ స్క్వాడ్ తనిఖీలు విస్తృతం చేశారు. సోమవారం ఆర్కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం తీరం వరకు పోలీస్ నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. సీజర్, లక్కీలు అనే రెండు డాగ్స్ తీరంలోని అనుమానిత వస్తువులను పరిశీలించాయి. పోలీసులు కూడా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించారు.

ఏడాదికో పండగ.. సంతోషాలే నిండుగా

ఆనందపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం మకర సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు, కొత్త అల్లుళ్లతో గ్రామాలు కళకళలాడాయి. ఇళ్ల ముందు రంగవల్లికలు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఇంట్లో ఉన్న కొత్త బియ్యంతో పాయసం చేసి పెద్దలకు నైవేద్యంగా సమర్పించి వారి ఆశీర్వాదం కోరారు. గంగిరెద్దుల వారు గ్రామ గ్రామాన తిరిగి పల్లె పదాలను వల్లించి గోమాతచే అందరికీ ఆశీర్వాదాలు అందించారు.



పూజలందుకున్న గోమాత

పశువులను కొలిచిన రైతులు

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రైతులు కనుమ పండగ నిర్వహించారు. ఆవులు, గెదెలు, దున్నలకు పసుపు, పారాణి రాసి శిరస్సులపై బొట్లు పెట్టారు. అందంగా అలంకరించి వాటికి ఇంట్లో తయారు చేసిన పిండి వంటలను ఆహారంగా అందించారు. ఈ ఏడాది కూడా తమను చల్లగా చూడాలని పశు సంపదను వేడుకున్నారు.

ఉత్సాహంగా పతంగుల పండగ

భీమునిపట్నం: ఇక్కడి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి రోజున పతంగుల పండగను ఉత్సాహంగా నిర్వహించారు. బీచ్‌లో సభ్యులు, పిల్లలు పతంగులు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఫ్యాబ్ ప్రతినిధి కాళ్ల సన్నీ మాట్లాడుతూ సంక్రాంతి పండగలో పతంగులను ఎగురవేయడం సంప్రదాయమన్నారు. పిల్లలకు సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. ఇందులో సభ్యులు మునునూరి శ్రీనివాస్, అడిదం కిశోర్, డాక్టర్ కాళ్ల లావణ్య పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాబ్ సభ్యులు, పిల్లలు

మేలుకొలుపుల సంబరాలు

తగరపువలస: సంక్రాంతి సంబరాల్లోభాగంగా వేకువజామున, సాయంత్రం ఇంటింటా మేలుకొలుపులు నిర్వహించడం గ్రామాల్లో ఆనవాయితీ. సంక్రాంతి మూడు రోజుల పాటు ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ మేలుకొలుపుల సంప్రదాయాలను కొనసాగించారు.



టి.నగరపాలెం రామాలయం నుంచి భజన చెట్టుతో బయలుదేరిన మేలుకొలుపుల బృందం

ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో..

చిట్టివలస ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

అసోసియేషన్ తరపున రూ.1.80 లక్షలతో స్మశాన వాటికలో విశ్రాంతి గది నిర్మించినట్టు తెలియచేస్తూ ఆహూతుల సమక్షంలో ఫొటో విడుదల చేశారు. తెలగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రంగూరి సీతారామదొర, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్, పరిమి భువనేశ్వరి, వబ్బిలిరెడ్డి ప్రసాద్, బండారు నానాజీ, చింతగుంట శివ, రంగూరి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



పద్య కవి బులుసు వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మండలంలో.. పద్మనాభం: మండల ప్రజలు మకర సంక్రాంతి వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుకున్నారు. తమ పితృ దేవతలను మూలకు తెచ్చుకుని పూజలు జరిపారు. పరమాన్నం, స్వీట్లు, కొత్త దుస్తులు సమర్పించారు. నరసాపురంలో రాముడి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర బంగారప్పడు పాల్గొన్నారు.



నరసాపురంలో కోలాటం ఆడుతున్న మహిళలు

పొగమంచుతో మామిడి పూతకు దెబ్బ



పొగమంచు వల్ల మాడిపోతున్న మామిడిపూత

ఆనందపురం : మండలంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న పొగ మంచు వల్ల మామిడిపూత దెబ్బ తింటుందని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. డిసెంబర్ ఆఖరులో మామిడిపూత ప్రారంభమై జనవరి నెలాఖరు వరకూ ఉంటుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 2 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఈ ఏడాది సకాలంలో పూత రావడంతో కష్టాలు గట్టెక్కుతాయని రైతులు ఆనందించారు. అయితే దట్టంగా కురుస్తున్న పొగ మంచు వల్ల బూజు తెగులు, బూడిద ఆకు తెగులు మామిడిని ఆశిస్తున్నాయి. మంచు వలన పూతపై బూజు వంటి పదార్థం ఏర్పడడంతో నల్లగా మారి పూత రాలి పోతోంది. ఇదే పరిస్థితి మరి కొంత కాలం కొనసాగితే తీవ్ర నష్టం రానుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవన శాఖ అధికారి స్వాతి వద్ద ప్రస్తావించగా లీటరు నీటిలో మైకోబుటానికల్ లేదా ట్రయోడెమోఫోస్, లేదా కార్బండిజమ్, లేదా థియోపా హంటీమిథైల్ మందు 0.1 శాతం పిచికారీ చేస్తే పూత రాలడాన్ని నివారించవచ్చని చెప్పారు.

ఘనంగా అనంతుని గిరి ప్రదక్షిణ

పద్మనాభం: కనుమ పండగలో భాగంగా పద్మనాభంలో అనంతుని గిరి ప్రదక్షిణ ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నాలుగు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. నిత్యారాధన, హోమం, బలిహరణ వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షిణ ఉత్సవం ప్రారంభమైంది. కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకిలో పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం గ్రామాల మీదుగా అనంతుని గిరి చుట్టు తిప్పారు. అడుగడుగున స్వామి భక్తుల పూజలందుకున్నారు. దీనిలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలు ఇసకలపాలెం పొలాల్లో ఉన్న పూలతోటలోకి వెళ్లి కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఇక్కడ పంటలు ఎలా పండాయని అయ్య వారు, అమ్మ వార్ల తరపు మాట్లాడుకునే సన్నివేశం ఆసక్తిగా నిలిచింది. పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా సమీపంలో ఉయ్యాల మండపం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు.



పూలతోటలోకి విహారానికి వెళ్ల వస్తున్న అనంతుని ఉత్సవ విగ్రహాలు

కొత్తపేట యూత్ ఔదార్యం



భవిరిశెట్టి గౌరి కుటుంబానికి సాయం అందిస్తున్న కొత్తపేట యూత్ ప్రతినిధులు

తగరపువలస: గత ఏడాది డిసెంబర్ 26న జీవీఎంసీ వాహనం ఢీకొని చికిత్స పొందుతూ 30న మరణించిన భీమిలి జోన్ ఒకటో వార్డు వాసి భవిరిశెట్టి రాంబాబు కుటుంబానికి సోమవారం కొత్తపేట యూత్ సభ్యులు రూ.11 వేల నగదు, నిత్యావసర సరకులు, బియ్యం మృతుని భార్య గౌరికి అందించారు. రజక వృత్తిపై జీవించే రాంబాబు కుటుంబం అతని మృతితో దిక్కు లేనిది అయిందని.. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ప్రతినిధులు కోన వేణుగోపాల్, మేకల ముత్యాలరావు, కోన వాసు, చొప్పా ప్రసాద్, నక్కాన రమేష్, మేకల సుబ్బారావు, నక్కాన అశోక్, చెల్లూరి శ్రీను, కొంకిపూడి శంకర్, రంగూరి శివ, నక్కాన జయ, అడపా శివ, రంగూరి స్వామి, హరికిషోర్, నడుపూరి చందు, పిట్టా భాస్కర్, దుబాయ్ గిరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రత్యేక శిక్షణ



శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ రోజైన సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 350 మంది క్యాడెట్లు పాల్గొనగా వారికి నావికాదళానికి సంబంధించి క్యాంప్ డ్రిల్, టెంట్ పిచ్చింగ్, ఆయుధాల వినియోగంపై అవగాహన, శరీర దారుఢ్య శిక్షణ, ఓరియంటేషన్ సబ్జెక్టులపై శిక్షణ, బెండ్స్ వంటివి నిర్వహించారు. ఈ శిబిరంలో క్యాంప్ కమాండెంట్ కమాండర్ సీజీ ఇంగ్లేశ్వర్, ఎన్‌సీసీ అధికారి కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో జోష్ నింపిన డ్యాన్స్‌లు

పీఎం పాలెం: సంక్రాంతి పండగ ఉత్సవాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆది, సోమవారాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్లో జోష్ నింపాయి. సోమవారం జ్యోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. భోగి మంటలు సంక్రాంతి కాంతులు అనే నృత్య రూపకంతో కార్యక్రమం ప్రారంభం అయింది. హేమంత మంచులో సూర్యుడు.. రంగుల పుట్టిల్లు తెలుగు లోగిళ్లు.. నింగిలో హరివిల్లు నృత్యరూపకాలు అద్భుతంగా ప్రదర్శించి కళాకారులు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. అరకు థింసా నృత్యం హైలైట్‌గా నిలిచింది. వదినకు ఒకసారి.. నోము నోమున్నాలో.. తదితర జానపద గేయాలకు కళాకారులు హుషారుగా నృత్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు సంజన, సంధ్య, కుషన్, మోదిక, మన్విత, భాషిత, వినీష, రిథం, చందు మొదలైన కళాకారులు పాల్గొనగా మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు.



కూచిపూడి నృత్య విన్యాసం

ముగిసిన సంక్రాంతి క్రికెట్ పోటీలు



చిట్టివలస బంతాట మైదానంలో విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న నిర్వాహకులు



సంగివలసలో క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న మంగరాజు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలసలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు చేతులమీదుగా ట్రోఫీలు అందించారు. చిట్టివలస బంతాట మైదానంలో కేపీఎల్ పోటీల విజేతలకు వెంపాడ శ్రీనివాసరెడ్డి, అక్కరమాని చిన బాబు బహుమతులు అందించారు. భీమిలి మండలం పాత మూలకుద్దులో నిర్వహించిన ఎంపీఎల్ పోటీల విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వీఆర్వో కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లి కోటిరెడ్డి, వ్యాపారవేత్త దువ్వి కిషోర్, జీరు మహేష్‌రెడ్డి, ఆశి రమణ, ఆశి చిట్టిబాబు, కేటీ రామునాయుడు, చిల్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాత మూలకుద్దులో విన్నర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

ఘనంగా అచ్చియ్యమ్మ పేరంటాలు పరస



అచ్చియ్యమ్మ పేరంటాలు గుడి వద్ద భజన చేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

మధురవాడ: ఎండాడ వారి ఆడపడుచు, మల్లయ్యపాలెం అల్లాడ వారి కోడలు, మధురవాడ పరిసర ప్రాంతాల ఆరాధ్య దేవత అచ్చియ్యమ్మ పేరంటాల జాతర సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జీవీఎంసీ జోనల్ కార్యాలయం సమీపంలో వెలసిన పేరంటాలు అమ్మ ఆలయం వద్ద ధర్మకర్తలు అల్లాడ ఉమామహేశ్వరరావు, అల్లాడ వెంకటరావు, అల్లాడ సూర్యారావు, అల్లాడ గంగరాజు, అల్లాడ లింగేశ్వరరావు తదితరులు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం భక్తులు నిర్వహించిన భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మధురవాడ, ఎండాడ, సాగర్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సిగడాం మహలక్ష్మి తీర్థం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేటలో సోమవారం కనుమ పండగ సందర్భంగా సిగడాం మహలక్ష్మి తీర్థం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఈ తీర్థాన్ని సందర్శించారు. తీర్థం సందర్భంగా దుకాణాలు వెలిశాయి. స్థానికులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంతో పాటు పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఇళ్ల ముందు గలీజుతో ఆందోళన



ఆదర్శనగర్ కరెంటు వీధిలో ఇళ్ల ముందు మట్టికుప్పలు

తగరపువలస: భీమిలి రెండో వార్డు ఆదర్శనగర్ కరెంటు వీధిలో ఇళ్ల ముందు మట్టి తొలగించకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టిన ఒక కుటుంబం బోరుబావి తవ్వించింది. ఆ సమయంలో వచ్చిన మట్టితో డ్రైనేజీలు నిండిపోవడంతో వారం రోజులుగా స్థానిక కుటుంబాల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. పరస్పరం మూడు కుటుంబాల వారు భీమిలి జెడ్సీకి ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ ఇళ్ల ముందు మట్టి తొలగించలేదు. శనివారం నుంచి సంక్రాంతి పండగ ప్రారంభమయినా సోమవారం వరకు ముగ్గులు వేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని స్థానికులు వాపోయారు. సీసీరోడ్డు పొడవునా నాలుగైదు చోట్ల వేసిన మట్టికుప్పలు తొలగించడంలో జీవీఎంసీ నిర్లక్ష్యం వల్ల పండగ సంతోషం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

30 ఏళ్లుగా దుస్తుల పంపిణీ

• తల్లి మీద ప్రేమతో ఉపాధ్యాయుడి దాతృత్వం

మధురవాడ: మధురవాడకు చెందిన ఉపాధ్యాయుడు యేటూరి వెంకటేష్ తన తల్లి యేటూరి లక్ష్మీకాంతం సూచన మేరకు 30 ఏళ్ల క్రితం తన శక్తి మేర పేదలకు దుస్తులు పంచడం ప్రారంభించారు. 2010 వరకు విజయనగరం జిల్లా పోరాంలో గల వారి స్వగ్రామంలోనే పంచేవారు. తర్వాత మధురవాడలో పంచుతూ వస్తున్నారు. ఆయన తల్లి 2000 సంవత్సరంలో మరణించిన తర్వాత కూడా ఆమె కోరిక మేరకు మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు, వికలాంగులు, వృద్ధులకు చీరలు, పంచెలు, లుంగీలు, తువ్వాళ్లు, దుప్పట్లు, రగ్గుల వంటివి పంచి పెడుతున్నారు. పైగా పంపిణీ కార్యక్రమాన్ని తన తండ్రి పైడిరాజు చేతుల మీదుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శ్రీ వెంకటేశ్వర విద్యాపీటల్ పాఠశాల ఆవరణలో చేపట్టిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి పేదలు భారీగా క్యూ కట్టారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. పాఠశాల ఆవరణలో అతని తండ్రి యేటూరి పైడిరాజు, పాఠశాల ఫౌండర్ చైర్మన్ యేటూరి వెంకటేష్, డైరెక్టర్లు సంధ్య, వినయ్ వికాస్, పూసర్ల సాయికిషోర్, వెంకట సౌజన్య తదితరులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. 1987లో చదువు నిమిత్తం విశాఖ వచ్చిన వెంకటేష్ చదువు పూర్తయిన తర్వాత మధురవాడలో ఓ చిన్న పాఠశాల ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. తల్లి కోరికను ఈ విధంగా తీర్చ గలుగుతున్నందుకు చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తన కుటుంబ సభ్యులు కూడా సహకారం అందిస్తూ వస్తున్నారని.. ఇది తనకు ఆనందాన్ని, శక్తిని ఇస్తుందన్నారు.



పేదలకు దుస్తులు పంచి పెడుతున్న వెంకటేశ్, అతని తండ్రి పైడిరాజు, కుటుంబ సభ్యులు


ట్రాఫిక్ వలంటీర్లకు ఆహ్వానం

మద్రిపాలెం: ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పని చేసేందుకు వలంటీర్లు కావాలని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఆసక్తి గల యవకులు, వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘసేవకులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

బోసిపోయిన రహదారులు




నిర్మానుష్యమైన పీఎం పాలెం ప్రధాన రహదారి



కారు షెడ్ కూడలి వద్ద సందడి లేని జాతీయ రహదారి

పీఎం పాలెం: సంక్రాంతి మరుసటి రోజైన కనుమ పండగ సోమవారం నాడు పీఎం పాలెం, జాతీయ రహదారి బోసి పోయి దర్శనం ఇచ్చాయి. అన్ని దుకాణాలు మూసివేయడంతో జన సంచారం నామమాత్రంగా ఉంది. రహదారి కూడళ్లలో ఆటోలు కనిపించలేదు. ప్రయాణికులు లేక పీఎం పాలెం కారుషెడ్ కూడలి.. బస్టాప్ నిర్మానుష్యంగా దర్శనం ఇచ్చాయి.

● వెనక్కి తగ్గిన సముద్రం



సముద్రం వెనక్కి వెళ్లడంతో బయట పడ్డ రాళ్లు

భీమిలి తీరంలో సముద్రం సోమవారం వెనక్కి తగ్గింది. సాధారణంగా ఆటుపోట్ల సమయాల్లో అలలు ముందుకు రావడం, వెనక్కి వెళ్లడం జరుగుతుంది. ఈ ప్రాంతంలో స్నానాలకు దిగడం అత్యంత ప్రమాదకరం. అలలు తీవ్రస్థాయిలో ఉండడంతో పాటు లోపలకు లాగేస్తాయి. తీరంలో పెద్దపెద్ద రాళ్లు, అండర్ వాటర్ కరెంట్ వల్ల ప్రమాదాలు జరుగుతాయి. కాని అలాంటివేవీ లేకుండా సముద్రం వెనక్కి తగ్గి.. ప్రశాంతంగా ఉండడంతో సందర్శకులు నీటిలో ఆడుకోవడంతో పాటు, ఫొటోలు తీసుకుంటూ చాలా సేపు సరదాగా గడిపారు. - భీమునిపట్నం